


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
12-07-2025
పేజీలు: 02



## బుమ్రా నయా చరిత్ర

ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రా నయా చరిత్ర సృష్టించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక సార్లు ఐదు వికెట్లను పడగొట్టిన బౌలర్‌గా కొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా ఐదు వికెట్లను పడగొట్టాడు. దీంతో డబ్ల్యూటీసి టోర్నమెంట్‌లో రికార్డు స్థాయిలో 12 సార్లు వికెట్ల ఫీట్ సాధించాడు. ఈ క్రమంలో ఇప్పటి వరకు టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పేరిట ఉన్న 11 సార్లు ఐదు వికెట్లను పడగొట్టిన రికార్డును తిరగరాశాడు. బుమ్రా ఈ సీజన్‌లో ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లను పడగొట్టడం ఇది రెండోసారి. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో కూడా బుమ్రా ఆరు వికెట్లను పడగొట్టాడు. తాజాగా ఈ మ్యాచ్‌లో 74 పరుగులకు ఐదు వికెట్లను పడగొట్టి రికార్డు సృష్టించాడు. అశ్విన్ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఆస్ట్రేలియాకు చెందిన ప్యాట్ కమిన్స్, నాథన్ లియాన్‌లు పదేసి సార్లు ఒకే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ఫీట్‌ను సాధించారు. వీరి నుంచి బుమ్రాకు పోటీ నెలకొంది.




## గోదావరికి పెరుగుతున్న వరద

గోదావరికి వరద క్రమేపీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి పోలవరం ప్రాజెక్టుకు వరద నీరు చేరుతోంది. స్పిల్‌వే అప్‌స్ట్రీమ్‌లో 30.860 మీటర్లు, డౌన్‌స్ట్రీమ్‌లో 21.726 మీటర్ల నీటిమట్టం నమోదైంది. 48 గేట్ల ద్వారా 6,40,047 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శని, ఆదివారాల్లో కూడా వరద తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఇవాళ సాయంత్రానికి 7.50 లక్షల క్యూసెక్కుల నీరు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



# ఫస్ట్ ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 145/3

భారత్, ఇంగ్లండ్ మధ్య లార్డ్స్‌లో జరుగుతున్న మూడో టెస్టులో ఆతిథ్య జట్టును కట్టడిచేసిన టీమ్‌ఇండియా.. తర్వాత బ్యాటింగ్‌లో నిలకడగా ఆడుతున్నది. టాపార్డర్ విఫలమైనప్పటికీ ఓపెనర్ కేఎల్ రాహుల్ (113 బంతుల్లో 53 నాటౌట్, 5 ఫోర్లు) తన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో అర్ధ శతకంతో మెరవగా కరుణ్ నాయర్ (40)రాణించాడు. రాహుల్‌తో పాటు రిషభ్ పంత్ (19 నాటౌట్) క్రీజులో ఉండగా రెండో రోజు ఆట చివరికి టీమ్‌ఇండియా.. 43 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో గిల్ సేన ఇంకా 242 రన్స్ వెనుకబడి ఉంది. అంతకుముందు 251/4తో రెండో రోజు ఆరంభించిన ఇంగ్లండ్.. మొదటి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ అయింది. రూట్ (104) శతకాన్ని పూర్తిచేసుకోగా లోయరార్డర్‌లో బ్రైడన్ కార్స్ (56), జెమీ స్మిత్ (51) అర్ధ శతకాలతో ఆ జట్టు మెరుగైన స్కోరు సాధించింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా (5/74) ఐదు వికెట్లతో విజృంభించగా సిరాజ్ (2/62) రెండు వికెట్లు తీశాడు. మూడో రోజు భారత్ ఎలా ఆడుతుందనేదానిపై ఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. 11 పరుగుల వ్యవధిలో ముగ్గురు కీలక బ్యాటర్లు పెవిలియన్‌కు చేరడంతో ఇంగ్లండ్ 300 పరుగుల్లోపు ఆలౌట్ అవుతుందని భావించినా భారత పేసర్లు మరోసారి పట్టు విడిచారు. ఈ సిరీస్‌లో మంచి ఫామ్ మీదున్న స్మిత్.. వ్యక్తిగత స్కోరు ఒక్క పరుగు వద్ద సిరాజ్ బౌలింగ్‌లో ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్స్‌లో రాహుల్ వదిలేయడం భారత్ కొంపముంచింది. ఆ అవకాశాన్ని అతడు చక్కగా వినియోగించుకున్నాడు. కార్స్‌తో కలిసి 8వ వికెట్‌కు అతడు 84 రన్స్ జోడించడంతో ఇంగ్లండ్ పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే లంచ్ విరామం తర్వాత రెండో ఓవర్లో సిరాజ్.. స్మిత్‌ను ఔట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. బుమ్రా.. ఆర్చర్ (4)ను క్లీన్‌బౌల్డ్ చేసి లార్డ్స్‌లో తొలిసారి ఐదు వికెట్ల ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. హాఫ్ సెంచరీ తర్వాత కార్స్‌ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ కథ ముగిసింది.



## హర్యానాలో 3.7 తీవ్రతతో భూకంపం

దేశ రాజధాని న్యూఢిల్లీలో శుక్రవారం సాయంత్రం భూకంప ప్రకంపనలు సంభవించాయి. సాయంత్రం ఏడు గంటల సమయంలో హర్యానాలో 3.7 తీవ్రతతో భూకంపం సంభవించడంతో ఢిల్లీలో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఝజ్జర్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు.రెండు రోజుల వ్యవధిలో హర్యానాలో ఇది రెండో భూకంపం. ఈ భూకంపం దాటికి ఢిల్లీతో పాటు సమీప ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి.రాత్రి 7.49 గంటలకు భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. హర్యానాలోని రోహ్తక్, బహదూర్‌గఢ్ జిల్లాల్లో కూడా ప్రకంపనలు సంభవించాయి. నిన్న ఉదయం ఝజ్జర్‌లో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. నిన్న కూడా ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి.

## హెచ్‌సీఏ కేసులో రంగంలోకి ఈడీ

హెచ్‌సీఏ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. హైదరాబాద్ క్రికెట్ క్లబ్ అవకతవకల వ్యవహారాన్ని విచారించేందుకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో శుక్రవారం సీఐడీ అధికారులకు హెచ్‌ఏసీ కేసు వివరాలు ఇవ్వాలని లేఖ రాసింది. ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టులు, వాంగ్మూలాలు సమర్పించాలని కోరింది. సీఐడీ నుంచి వివరాలు రాగానే కేసు నమోదు చేసి ఈడీ అధికారులు సైతం దర్యాప్తు మొదలుపెట్టనున్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు సహా ఐదుగురిని సీఐడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈడీ ఎంట్రీ ఇవ్వడంతో ఈ కేసు ఎలాంటి మలుపు తీసుకోబోతుందనే దానిపై ఉతంఠ నెలకొంది.



## ఢిల్లీలో కూలిన మూడంతస్తుల భవనం


ఢిల్లీలోని సీలంపూర్‌లో మూడంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. స్థానికులు నలుగురిని రక్షించి ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, ఎన్ డిఆర్‌ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్టు సమాచారం. పది మంది వరకు మృతి చెంది ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్




భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. భక్తులు తమ అభిప్రాయాలను వాట్సాప్ ద్వారా సులభంగా తెలియజేసేలా నూతన పద్ధతికి శ్రీకారం చుట్టింది. దీని కోసం తిరుమల, తిరుపతిలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేశారు. భక్తులు తమ మొబైల్‌తో కోడ్‌ను స్కాన్ చేస్తే వాట్సాప్‌లో టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. అందులోకి ప్రవేశించిన వెంటనే తమ పేరు, విభాగం (అన్నప్రసాదం, పరిశుభ్రత, కల్యాణకట్ట, లడ్డూప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు వంటివి) ఎంచుకోవాలి. అనంతరం తమ అభిప్రాయాన్ని తెలియజేసేందుకు టెక్స్ట్ లేదా వీడియో ఫార్మాట్‌ను ఎంచుకోవాలి. తర్వాత సేవా ప్రమాణాన్ని ఉత్తమం, సగటు, మరింత మెరుగదల అవసరం, లేదా బాగాలేదు అనే ఐచ్ఛికాల ద్వారా రేటింగ్ చేయాలి. అభిప్రాయాన్ని సమర్పించిన తర్వాత ధ్రువీకరణ సందేశాన్ని భక్తులు పొందవచ్చు. ఈ ఫీడ్‌బ్యాక్‌ను టీటీడీ అధికారులు పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటారు


## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం



ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసులో నిందితులుగా ఉన్న వారి ఆస్తుల జప్తునకు ఏసీబీ కోర్టు అనుమతిచ్చింది. రూ.32 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, వైసీపీ హయాంలో మద్యం సేకరణ, పంపిణీ, ధరల నిర్ణయంలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేస్తోంది. మద్యం స్కామ్‌లో ఇప్పటికే చాలా మందిని అరెస్ట్ చేసి విచారించింది.

## ఫేవరెట్‌గా స్వియాటెక్

### నేడు అనిసిమోవాతో తుది పోరు




ప్రపంచ మహిళా టెన్నిస్‌పై తనదైన ముద్ర వేసిన పోలండ్ యువ సంచలనం ఇగా స్వియాటెక్ తన కెరీర్‌లో తొలి వింబుల్డన్ టైటిల్‌ను (Wimbledon title) సొంతం చేసుకోవాలనే పట్టుదలతో కనిపిస్తోంది. శనివారం జరిగే ఫైనల్లో 8వ సీడ్ ఇగా స్వియాటెక్ అమెరికాకు చెందిన 13వ సీడ్ అమందా అనిసిమోవాతో తలపడనుంది. స్వియాటెక్ ఇప్పటికే ఐదు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్‌ను సొంతం చేసుకుంది. నాలుగు సార్లు ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచిన ఇగా ఓసారి యూఎస్ ఓపెన్‌ను దక్కించుకుంది. తొలిసారి వింబుల్డన్ ఓపెన్ ఫైనల్లో ప్రవేశించింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన కెరీర్‌లో తొలి వింబుల్డన్ ట్రోఫీని జత చేసుకోవాలని తహతహలాడుతోంది. ఫైనల్లో ఇగాఫేవరెట్‌గా కనిపిస్తోంది. మహిళల టెన్నిస్‌లోని అగ్రశ్రేణి క్రీడాకారిణిల్లో ఒకరిగా ఇగా పేరు తెచ్చుకుంది. నిలకడైన ఆటతో విమెన్స్ టెన్నిస్‌పై తనదైన ముద్ర వేసింది. ప్రతిష్ఠాత్మకమైన వింబుల్డన్ టైటిల్‌తో పూర్వవైభవం సంతరించుకోవాలని భావిస్తోంది. మరోవైపు అమందా కెరీర్‌లో తొలి సారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ సింగిల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరింది. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అమందా అసాధారణ ఆటతో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. నువ్వానేనా అన్నట్టు సాగిన సెమీ ఫైనల్లో టాప్ సీడ్ అరినా సబలెంకను మట్టికరిపించింది. సబలెంకను ఓడించిన అమందా ఫైనల్లోనూ అదే జోరును కొనసాగించాలనే లక్ష్యంతో కనిపిస్తోంది. ఈ టోర్నీలో అమందా అత్యంత నిలకడైన ఆటతో అలరిస్తోంది. తీవ్ర ఒత్తిడిని సయితం తట్టుకుంటూ ముందుకు సాగింది. ఇక కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు ఓ విజయం దూరంలో నిలిచింది. శనివారం జరిగే ఫైనల్లో గెలిచి చరిత్ర సృష్టించాలని అమందా తహతహలాడుతోంది.



## నభా నటేశ్ హాట్ లుక్స్

సినీరంగంలోకి ఇప్పుడిప్పుడే వరుస ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది ఈ హీరోయిన్. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే నటనపై ఆసక్తితో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. కానీ ఈ బ్యూటీ నటించిన సినిమాలు అంతగా మెప్పించకపోవడంతో ఈ అమ్మడుకు ఆశించిన స్థాయిలో బ్రేక్ రాలేదు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే యాక్సిడెంట్ కారణంగా సినిమాలకు దూరమైన ఈ వయ్యారి.. కొన్నాళ్లు సినిమాలకు దూరమయ్యింది. ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. హీరోయిన్ నభా నటేష్. ప్రస్తుతం యంగ్ హీరో నిఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న స్వయంభు చిత్రంలో నటిస్తుంది. ఇందులో సంయుక్త మీనన్ సైతం కథానాయికగా నటిస్తుంది. తాజాగా నభా నటేష్ కు క్రేజీ ఆఫర్ వచ్చినట్లుగా తెలుస్తోంది. టాలీవుడ్ డైరెక్టర్ గోపిచంద్ మలినేని దర్శకత్వంలో బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో జాట్ అనే సినిమా రూపొందుతుంది. పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ సినిమాగా వస్తోన్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.

సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com





# 5 బంతుల్లో 5 వికెట్లు

క్రికెట్‌లో మరో రికార్డు బద్దలైంది. ఐర్లాండ్ వేదికగా జరుగుతున్న ఇంటర్-ప్రావిన్షియల్ టీ20 ట్రోఫీలో ఐర్లాండ్ ఆల్‌రౌండర్, మన్‌స్టర్ రెడ్స్ క్రికెటర్ కర్టిస్ కాంఫర్ అరుదైన రికార్డుతో ఆకట్టుకున్నాడు. శుక్రవారం నార్త్-వెస్ట్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కాంఫర్ ఐదు బంతుల్లో ఐదు వికెట్లు తీసి ప్రొఫెషనల్ నయా ఫీట్‌ను నమోదు చేశాడు. 189 పరుగుల లక్ష్యఛేదన కోసం బరిలోకి దిగిటన నార్త్-వెస్ట్ వారియర్స్ కాంఫర్ ధాటికి 88 పరుగులకే కుప్పకూలింది. ఒక దశలో 5 వికెట్లకు 87 పరుగులతో ఉన్న వారియర్స్ టీమ్‌ను కంపర్ కోలుకోలేని దెబ్బతీశాడు. 12.4 బంతికి జారెడ్ విల్సన్.. కాంఫర్‌కు తొలి వికెట్ దక్కగా, తర్వాత బంతికి గ్రహమ్ హ్యూమ్ ఎల్బీడబ్ల్యూగా వికెట్ల ముందు దొరికిపోయాడు. అదే జోరు కొనసాగిస్తూ 14వ ఓవర్ తొలి మూడు బంతుల్లో అండీ మెక్‌బ్రైన్, రాబీ మిల్లర్, జోష్ విల్సన్ వరుసగా పెవిలియన్ చేరడంతో కాంఫర్ ఖాతాలో హ్యాట్రిక్ చేరింది.



# మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.344 కోట్లు వడ్డీ లేని రుణాలు

తెలంగాణలోని రేవంత్ సర్కార్ మహిళా స్వయం సహాయక సంఘాలకు శుభవార్త అందించింది. రూ.344 కోట్ల వడ్డీ లేని రుణాలను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సెర్ప్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ నిధులు మంజూరు చేసింది.మొత్తం రూ.344 కోట్లలో రూ.300 కోట్లు గ్రామీణ మహిళా సంఘాలకు కేటాయించగా, రూ.44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు కేటాయించారు. ఈ రోజు శనివారం నుంచి 18వ తేదీ వరకు మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీలు జమ చేయనున్నారు.ఈ క్రమంలో భాగంగా అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు చెక్కుల పంపిణీ చేయనున్నారు. అదే విధంగా ప్రమాద బీమా, లోన్ బీమా చెక్కులను సైతం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో వడ్డీ లేని రుణాలు గత బీఆర్ఎస్ హయాంలో నిలిచిపోయిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో సుమారు రూ.3 వేల కోట్లకు పైగా బకాయిలు పెట్టింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీ లేని రుణాల చెల్లింపుపై నిర్ణయం తీసుకున్నారు.



# జనసేన ఇన్‌చార్జ్ కోటా వినూత డ్రైవర్ మర్డర్

శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జ్ కోటా వినూత, భర్త చంద్రబాబును అరెస్ట్ చేసి విచారిస్తున్న పోలీసులు, గోడౌన్‌లో డ్రైవర్ రాయుడును చిత్రహింసలకు గురిచేసి హత్య చేసి నదిలో పడేసినట్లు సమాచారం. చెన్నై సమీపంలోని కూవం నదిలో యువకుడి మృతదేహం లభ్యం. ఈ క్రమంలో శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జ్ వినూత కోటా, ఆమె భర్త చంద్రబాబును పోలీసులు విచారించగా.. ఆపై ఆమె మాజీ డ్రైవర్ శ్రీనివాసుల రాయుడుదిగా నిర్ధారించిన పోలీసులు. బొక్కసంపాలెం గ్రామానికి చెందిన యువకుడు సీహెచ్ రాయుడు కొంతకాలంగా వినూత కోటా దగ్గర నమ్మిన బంటుగా, డ్రైవర్‌గా, ఆమెకు వ్యక్తిగత సహాయకుడిగానూ పని చేశాడు.. అయితే జూన్ 21వ తేదీన అతను చేసిన ద్రోహానికి విధుల నుంచి తొలగిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటన చేసిన వినూత కోటా ఇక మీదట శ్రీనివాసులుకి, తమకు ఎలాంటి సంబంధం లేదని అందులో పేర్కొన్న వినూత కోటా, ఈ నెల 8వ తేదీన రాయడిని హత్య చేసి నదీలో పడేసినట్లు గుర్తించిన పోలీసులు. ఈ హత్య కేసు విషయంలో వినూత కోటా, చంద్రబాబుతో సహా శివకుమార్, దాసర్, గోపిని అరెస్టు చేసిన పోలీసులు.

**జనసేన పార్టీ సీనియర్ మహిళా నేత సస్పెండ్.. యువకుడి హత్యకేసులో అరెస్ట్ కావడంతో!**

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త హత్య కలకలం రేపింది. ఈ నెల 8న శ్రీనివాసులు అలియాస్ రాయుడు మృతదేహాన్ని చెన్నైలోని కూవం నది సమీపంలో పోలీసులు గుర్తించారు. అతడి చేతి మీద జనసేన పార్టీ సింబల్‌తో పాటుగా వినుత పేరు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో ఈ నెల 8వ తేదీన రాయడిని హత్య చేసి నదిలో పడేసినట్లుగా తెలుస్తోంది.. అతడ్ని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. చెన్నై పరిధిలోని మింట్ పోలీస్ స్టేషన్ లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ కేసులో శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇంఛార్జ్ కోట వినుతతో పాటు ఆమె భర్త చంద్రబాబు సహా ఐదుగుర్ని చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. వారందర్ని చెన్నై నుంచి శ్రీకాళహస్తి తీసుకొచ్చి విచారణ చేస్తున్నారు. రాయుడు హత్యకేసులో వినుతను అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. బొక్కసంపాలెం గ్రామానికి చెందిన రాయుడు శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జ్ కోట వినుతకు డ్రైవర్‌గా, ఆమెకు వ్యక్తిగత సహాయకుడిగా కూడా పని చేస్తున్నారు.. అతడు నమ్మకమైన వ్యక్తిగా ఉన్నారు. అయితే వినుతను అరెస్ట్ చేసిన కొద్దిసేపటికే జనసేన పార్టీ ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. జూన్ 21వ తేదీన వినుత ఉన్నట్టుండి ఓ బహిరంగ ప్రకటన చేశారని.. రాయుడు చేసిన ద్రోహానికి విధుల నుంచి తొలగిస్తున్నట్లు అటు పేపర్‌తో పాటుగా ఇటు సోషల్ మీడియా ద్వారా అందరికి తెలియజేశారట. ఇక మీదట శ్రీనివాసులుకి, తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారట. ఇంతలోనే రాయుడు శవమై కనిపించడం.. ఈ కేసులో వినుతన చెన్నై పోలీసులు అరెస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. రాయుడు హత్య గురించి చెన్నై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ అరెస్ట్ ఎపిసోడ్‌కు సంబంధించిన పూర్తి సమాచారం రావాల్సి ఉంది.




# 'జూనియర్' ట్రైలర్ రిలీజ్

కిరీటి రెడ్డి 'జూనియర్' చిత్రంతో సిల్వర్ స్క్రీన్ పై అరంగేట్రం చేయబోతున్నాడు. ఈ సినిమా జూలై 18, 2025న విడుదల కానుంది. రాధా కృష్ణ దర్శకత్వం వహించిన ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వారాహి చలన చిత్రం బ్యానర్ ఆధ్వర్యంలో రాజానీ కొర్రాపతి నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటికే బజ్ నిర్మించడం ప్రారంభించింది. ఏస్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి ప్రారంభించిన ఈ సినిమా ట్రైలర్ అందరిని ఆకట్టుకుంటుంది. ఈ కథ తండ్రి-కొడుకు సంఘర్షణ, విలేజ్ డ్రామా వంటి ఇతివృత్తాలను అన్వేషిస్తుంది మరియు జెనెలియా ఈ ప్రాజెక్టులో విలువను జోడించే కీలక పాత్రలో నటిస్తుంది. కిరీటి రెడ్డి తన స్క్రీన్ ఉనికి మరియు ఆకట్టుకునే నృత్య కదలికలతో దృఢమైన ముద్ర వేస్తాడు. హర్ష మరియు సత్య కామిక్ చిత్రానికి ప్లస్ కానున్నట్లు భావిస్తున్నారు. ఈ సినిమాకి కెకె సెంథిల్ కుమార్ యొక్క సినిమాటోగ్రఫీ, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ యొక్క మ్యూజిక్, రవీందర్ యొక్క ప్రొడక్షన్ డిజైన్, పీటర్ హీన్ యొక్క హై-ఆక్టేన్ యాక్షన్ కొరియోగ్రఫీ మరియు నిరంజన్ దేవరమనే ఎడిటింగ్ ఉన్నాయి. ఈ చిత్రానికి కళ్యాణ్ చక్రవర్తీ త్రిపురనేని రాసిన డైలాగ్స్ ఉన్నాయి. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నటుడు రవిచంద్రన్, వైవా హర్ష మరియు జెనీలియా కీలక పాత్రలలో నటిస్తున్నారు. ఈ సినిమాకి దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు.



# మూడోసారి ఫైనల్లో అల్కరాజ్

టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ వరుసగా వింబుల్డన్ (Wimbledon) మూడో టైటిల్ వేటకు సిద్ధమయ్యాడు. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్లో టేలర్ ఫ్రిట్జ్(అమెరికా)ను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. నాలుగు సెట్ల పోరులో తనదైన దూకుడు కొనసాగించిన స్పెయిన్ స్టార్ ఫ్రిట్జ్ ఫైనల్ ఆశలపై నీళ్లు చల్లాడు. వరుసగా 24వ విజయంతో మూడో ఏడాది కూడా టైటిల్ వేటలో నిలిచాడీ టెన్నిస్ సంచలనం. భారీ అంచనాల నడుమ వింబుల్డన్ బరిలో నిలిచిన డిఫెండింగ్ ఛాంపియన్ అల్కారాజ్ సెమీఫైనల్లో ఛాంపియన్ ఆటతో రెచ్చిపోయాడు. తొలి సెట్‌ను 6-4తో గెలుచుకున్న అతడికి టేలర్ రెండో సెట్‌లో షాకిచ్చాడు. అయితే.. ఆ తర్వాత పుంజుకున్న అల్కారాజ్ మూడో సెట్‌లో అమెరికా స్టార్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. 6-3తో పైచేయి సాధించిన స్పెయిన్ కెరటం.. నాలుగో సెట్‌ను ఒక్క పాయింట్ తేడాతో గెలుపొందాడు. 'వింబుల్డన్‌లో రికార్డు విజయాల గురించి నేను ఆలోచించడం లేదు. మ్యాచ్ ఫలితాల గురించి నేను ఆందోళన చెందడం లేదు. నా లక్ష్యం మీదే దృష్టిసారించాను. ప్రస్తుతానికి నేను ఆదివారం జరుగబోయే ఫైనల్ గురించి కూడా పెద్దగా ఆలోచించడం లేదు. సెమీస్ విజయాన్ని ఆస్వాదిస్తున్నా. మరోసారి ఫైనల్ చేరినందుకు చాలా హ్యాపీగా ఉంది' అని అల్కరాజ్ అన్నాడు. 2023లో జకోవిచ్‌ను మట్టికరిపించి తొలిసారి వింబుల్డన్ ఛాంపియన్‌గా అవతరించిన అల్కారాజ్.. నిరుడు కూడా జకోకు ట్రోఫీని దక్కనివ్వలేదు. సో.. ముచ్చటగా మూడోసారి కూడా అతడు టైటిల్‌పై కన్నేశాడు.

# ఇందిరమ్మ క్యాంటీన్లలో టిఫిన్స్.. 6 వెరైటీలు, 5 రూపాయలకే

తెలంగాణలోని రేవంత్ సర్కార్.. ఇందిరమ్మ క్యాంటీన్లను తెచ్చేందుకు రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నగరం అంతటా ఇందిరమ్మ క్యాంటీన్లు తెరిచి.. వాటి ద్వారా పేద వారికి అతి తక్కువ ధరకే అనగా కేవలం 5 రూపాయలకు రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం అందించేందుకు ప్రణాళికలు రెడీ చేస్తోంది. త్వరలోనే నగర వ్యాప్తంగా ఇందిరమ్మ క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం నగరవ్యాప్తంగా మధ్యాహ్నం వేళ రూ.5కే భోజనం పెడుతూ.. పేద వారి కడుపు నింపుతున్న అన్నపూర్ణ క్యాంటీన్లనే.. ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చనున్నారు. ఇకపై వీటిల్లో మధ్యాహ్న భోజనంతో పాటుగా ఉదయం పూట టిఫిన్ కూడా అత్యంత తక్కువ ధరకే అందించేందుకు రేవంత్ సర్కార్ ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా అందించబోయే టిఫిన్లకు సంబంధించి.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) మెనూ సిద్ధం చేసింది. వీటిల్లో ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్‌తో పాటుగా మిల్లెట్ టిఫిన్లు కూడా అందించనున్నారు. జీహెచ్ఎంసీ నిర్ణయం మేరకు.. ప్రజల నుంచి ఒక్కో టిఫిన్‌కు కేవలం రూ.5 మాత్రమే వసూలు చేయనుంది. జీహెచ్ఎంసీలో వడ్డించే టిఫిన్‌కు సాధారణంగా రూ.19 ఖర్చవుతుండగా.. జనాల నుంచి రూ.5.. మిగతా రూ.14 ఖర్చును ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమవుతుంది. హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ రూపొందించిన టిఫిన్ మెనూను అమలు చేయనున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో



ఉంచుకుని మిల్లెట్ ఆహారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రోజుకో రకమైన అల్పాహారాన్ని.. అత్యంత తక్కువ ధరకే సామాన్యులకు అందించనున్నారు. ఈ మెనూలో భాగంగా 6 రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో రకం టిఫిన్ వడ్డించనున్నారు. మెనూలో ఉన్న టిఫిన్ లిస్ట్ రోజు వారిగా ఇలా ఉండబోతుంది.

1వ రోజు: మిల్లెట్ ఇడ్లీ (3), సాంబార్, చట్నీ/పొడి
2వ రోజు: మిల్లెట్ ఉప్మా, సాంబార్, మిక్స్ చట్నీ
3వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ
4వ రోజు: ఇడ్లీ (3), సాంబార్, చట్నీ
5వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ
6వ రోజు: పూరీ (3), ఆలూ కూర్మా

ఇందిరమ్మ క్యాంటీన్లలో వడ్డించే ప్రతి టిఫిన్‌కు సరిపోయేలా ఖచ్చితమైన గ్రాముల వారీగా పదార్థ పరిమాణాలూ నిర్ణయించారు. ఉదాహరణకి మిల్లెట్ ఇడ్లీ తీసుకుంటే.. ఒక్కో ఇడ్లీ 45 గ్రాములు, సాంబార్ 150 గ్రాములు, చట్నీ 15 గ్రాములుగా ఉండనుంది. ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం జీహెచ్ఎంసీ 139 ప్రాంతాల్లో కొత్త కంటైనర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.11.43 కోట్ల ఖర్చు చేయనున్నారు. ఈ క్యాంటీన్‌లలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యం. పేద, మధ్య తరగతి ప్రజల కోసం రూపొందించిన ఈ పథకం.. వారికి తక్కువ ధరకే ఆరోగ్యకరమైన అల్పాహారాన్ని అందించడంలో మైలురాయిగా నిలవనుంది అంటున్నారు అధికారులు.



# సిజ్లింగ్ నిధి

17 ఆగస్టు 1993న తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో జన్మించింది వయ్యారి భామ నిధి అగర్వాల్. పెరిగింది మాత్రం బెంగుళూరులో. హిందీ మాట్లాడే మార్వాడీ కుటుంబంలో జన్మించినప్పటికీ తెలుగు, తమిళం, కన్నడ భాషలను అర్థం చేసుకోవడంతోపాటు మాట్లాడగలదు ఈ బ్యూటీ.2014లో మిస్ దివా యూనివర్స్ పోటీల్లో పాల్గొంది అందాల భామ నిధి అగర్వాల్. ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. హిందీలో మున్నా మైకెల్ అనే సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. ఈ సినిమా తర్వాత టాలీవుడ్ కు మకాం మార్చింది.2018లో అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన సవ్యసాచి సినిమాతో తెలుగు చలన చిత్ర అరంగేట్రం చేసింది. ఈ సినిమా అంతగా మెప్పించలేకపోయిన తెలుగులో మంచి క్రేజ్ అందుకుంది. తర్వాత వరుస సినిమాలు క్యూ కట్టాయి.